క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన డొకె మల్లుకు రూ.30 వేలు, ఎల్కపల్లి గ్రామానికి చెందిన జునుగరి రామన్నకు రూ.54వేలు సీఎం సహాయనిధి నుంచి మంజూరైంది. వీటి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, శక్తికేంద్ర ఇన్‌చార్జి నగేశ్, నాయకులు వెంకన్న, కుకిడే వెంకన్న, ప్రభాకర్, సాయి, కమలాకర్, పురుషోత్తం, గుండయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యనిషేధానికి సహకరించాలి



ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

బెజ్జూర్: బెజ్జూర్ పంచాయతీ పరిధిలోని ఎలకపల్లి(బి) గ్రామంలో మద్యనిషేధించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి వ్యాపారులు గుడుంబా, మద్యాన్ని విక్రయించకుండా సహకరించాలని కోరుతూ ఎస్సై విక్రమ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం మంచిదని, తనవంతు సహకారం అందిస్తానన్నారు. గుడుంబా సరఫరా చేసిన, విక్రయించిన తమకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

కౌటాల: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని కౌటాల విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ అన్నారు. కౌటాల సబ్‌స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాంమూర్తి పదోన్నతిపై ఆసిఫాబాద్‌కు, కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు బదిలీపై వచ్చిన ప్రవీణ్‌కుమార్‌లను మంగళవారం సన్మానించారు. ఫోర్‌మెన్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

వాంకిడి: పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని బనార్‌కొసార గ్రామంలో సోమవారం రాత్రి పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.2,200 నగదు సీజ్ చేశామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల్లో భాగంగా ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ సహాయక ఇంజినీర్ సదాశివ్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రావణదహనం నిలిపివేయాలి

తిర్యాణి: రావణదహనం నిలిపివేయాలని రాంజీగోండు సేవాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గుణవంత్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోండులు రావణుడిని దేవుడిగా పూజిస్తారని, రావణ దహనం చేయడం ద్వారా వారి మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు. విజయదశమి రోజున నిర్వహించే రావణదహనానికి దూరంగా ఉండాలన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థప్రతినిధి శివకుమార్ ప్రకటనలో కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువకులకు న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో మూడునెలల ఉచితశిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలక్ట్రికల్,హౌజ్‌వైరింగ్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాల్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఐటీడీఏ వైటీసీలో శిక్షణ ఉంటుందన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సంతోశ్‌ఫంక్షన్ హాల్‌లో పట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్,కార్యవర్గసభ్యులుగా సమ్మయ్య, నారాయణ, రామస్వామి, ఉపాధ్యక్షుడిగా దత్తాత్రి, రాజయ్య, సదానందం, రవికుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు బాలరాజు,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షుడు అంజయ్య, భీమారం అధ్యక్షుడు వెంకటేశం ఉన్నారు.

ఎడమొహం.. పెడమొహం..!



- మనస్పర్థలతో పోలీస్‌స్టేషన్ మెట్లెక్కుతున్న దంపతులు
- ఈ ఏడాది జిల్లాలో 78 కేసులు
- పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నా మారని తీరు
- సర్దుకుంటేనే సంసారమంటున్న అధికారులు

కౌటాల: దంపతుల్లో 'ఇగో'కాపురాలను కూల్చేస్తోంది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్నచిన్న మనస్పర్థలు, అనుమానాలు కలతలు సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడునీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు వేరుకుంపటికి దారితీస్తున్నాయి. సర్దుకుపోవాల్సిన దంపతులు మొండిపట్టు పడుతుండడంతో విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. చిన్నచిన్న మనస్పర్థలతో ఠాణా మెట్లెక్కుతున్నారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నప్పటికీ వారి తీరు మారడం లేదు. ఇరు కుటుంబ సభ్యులు సరైన సమయంలో స్పందించకపోవడంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోవడానికి కారణమవుతోంది. కొన్ని సందర్భాల్లో పోలీసులు, పెద్దల వద్దకు వెళ్తే ఎక్కడ పరువుపోతుందోనని.. ఎవరికీ చెప్పుకోలేక మదనపడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

కౌన్సెలింగ్ ఇస్తున్నా..

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏటా భార్యాభర్తల మధ్య ఘర్షణలు, వరకట్న వేధింపులు, గృహహింస, ప్రేమ వివాహాలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ ఏడాది జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సంబంధించిన వంద మందికి పైగా దంపతులు ఘర్షణ పడి ఫిర్యాదు చేసుకున్నారు. ఇందులో 78 కేసులు నమోదయ్యాయి. ఇందులో కొందరు విడాకుల వరకు వెళ్లారు. జిల్లా పరిధిలో కనీసం రోజుకో జంటకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తుండడంతో ఆ దంపతులు సంసారం సాగిస్తున్నారు. జిల్లాలోని పోలీసుస్టేషన్లలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఒకరికొకరు కేసులు పెట్టుకున్నా దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే డీఎస్పీలతో సీఐ, ఎస్సైలు కౌన్సెలింగ్ ఇస్తున్నా కొన్నిసార్లు దంపతుల మధ్య సయోధ్య కుదుర్చలేకపోతున్నారనే వాదనలు ఉన్నాయి.

ప్రేమికులే అధికం..

జిల్లాలోని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు ఎక్కువగా ఉద్యోగం చేస్తున్న దంపతులు, ప్రేమ వివాహం చేసుకున్న నవ దంపతులే అధికంగా ఉంటున్నారు. సినిమాల ప్రభావం నేటి యువతరంపై ఎక్కువ ఉంది. దీనికి తోడు సెల్‌ఫోన్లు ప్రేమికులను మరింత చేరువ చేస్తున్నాయి. చాటింగ్, వాట్సాప్ కాల్, వీడియో కాల్‌తో నిత్యం కలుసుకునే వీలుగా ఉంటుంది. సోషల్ మీడియా ప్రభావం యువతపై ఉంది. దీంతో చాలా మంది తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లే ధైర్యం చేయడం లేదు. ప్రేమపెళ్లి చేసుకున్న వారిలో చాలామంది విడాకుల వరకు వెళ్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఇద్దరు ఉద్యోగం చేస్తుండడం, సంపాదనలో తానేమీ తక్కువ కాదంటూ భావిస్తుండడం ఘర్షణలకు దారితీస్తోంది. ప్రేమ వివాహాలకు సంబంధించి ఆరు నెలల్లోపే ఆర్థిక ఇబ్బందులు, అనుమానాల కారణంగా పోలీస్‌స్టేషన్లకు చేరుకుని ఒకరికొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. చాలామంది యువత ప్రేమ పేరిట ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి అవసరమైతే కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచిస్తున్నారు.

ఒక్కటి చేసేందుకే ప్రయత్నం



ప్రతీ కుటుంబంలో మనస్పర్థలు సహజం. సర్దుకుని సంసారం చేస్తేనే కుటుంబాలు బాగుంటాయి. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి చాలా మంది దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు. వీరిని ఒక్కటి చేసేందుకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. అయినా వినకపోతే కేసులు నమోదు చేస్తున్నాం. భార్యభర్తలిద్దరిని కలిపేందుకే సఖీ కేంద్రాలు సైతం కృషి చేస్తున్నాయి.

– ఎస్.మధుకర్, ఎస్సై, కౌటాల

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎమ్మెల్సీ ఓటరు జాబితా రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1, 2001కి ముందు డిగ్రీ పూర్తయిన వారి నుంచి పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి దరఖాస్తు పరిశీలించి జాబితాలో పేరు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

సిర్పూర్(టి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని వసతి గృహ ఆవరణలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటా తిరిగి పోలింగ్‌బూత్ వారీగా నిర్వహించాలన్నారు. గ్రామాల నుంచి వచ్చిన పలువురు యువతీ, యువకులతో పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం సిర్పూర్(టి) మాజీ జెడ్పీటీసీ నీరటి రేఖ, సత్యనారాయణ దంపతుల కుమారుడు నీరటి తేజ ప్రతిమ ఆసుపత్రిలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించినందుకు గాను సన్మానించి అభినందించారు. నాయకులు నీరటి సత్యనారాయణ, ఎల్ములే శంకర్, దోని శ్రీశైలం, మహేశ్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కౌటాల: బీజేపీ కార్యకర్తలు శరవేగంగా పార్టీ సభ్యత్వాలు చేయించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో మంగళవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం ఈనెల 15వ తేదీ వరకు 30వేల సభ్యత్వాలు చేయాలన్నారు. కౌటాలలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని, రెండు నెలల్లో కౌటాల 133కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ అందుబాటులో వస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నారులే వానుపటేల్, ప్రధాన కార్యదర్శి మితున్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఉద్యోగావకాశం ఇవ్వాలి

తిర్యాణి: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం భూములు కోల్పోయిన ఆదివాసీలకు కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడం సుభాశ్ డిమాండ్ చేశారు. బెల్లంపెల్లి ఏరియాలో జీఎం శ్రీనివాస్‌కు మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జీఎంను సన్మానించారు.

'సర్దార్ రవీందర్‌సింగ్‌కు మద్దతు ఇవ్వండి'



మాట్లాడుతున్న చైతన్య

ఆసిఫాబాద్‌అర్బన్: రాబోయే ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్‌కు విద్యావంతులు మద్దతు ఇవ్వాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన పోరాటయోధుడు రవీందర్‌సింగ్‌కు మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వచ్చేనెల 6వ తేదీ వరకు అర్హులైన గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో సూరరామ్ యాదవ్, నైతం మహేశ్, రమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నుంచి జగిత్యాల వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను మంగళవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు. వినయ్‌గార్డెన్ వద్ద తనిఖీల్లో రెండు వాహనాల్లో ఆరు పశువులు, దాదానగర్ సమీపంలో మూడు వాహనాల్లో 9 పశువులను పట్టుకుని సీజ్ చేశామన్నారు. పశువులను గోశాలకు తరలించామన్నారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న దాదానగర్‌కు చెందిన సయ్యద్ సమీర్, కొమ్మ కుమారస్వామి(పెద్దపల్లి జిల్లా కొత్తూరు), చింతలమానెపల్లి మండలం బాబాపూర్‌కు చెందిన నక్క శేఖర్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కోడూరుకు చెందిన షేక్ గౌస్, చిల్వకోడూరుకు చెందిన మద్దెల గంగాధర్, కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన పెర్క లింగమూర్తి, మారిశెట్టి సత్తయ్య, కౌటాలకు చెందిన అనంతుల భగవాన్, పెద్దపల్లి జిల్లా అబ్బాపూర్‌కు చెందిన కొమ్మ కుమార్, ధర్మరాజులపల్లికి చెందిన జక్కుల జానయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడంపై మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకొన్నారు. మల్లికార్జున్, సతీశ్‌బాబు, చంద్రకాంత్, జయరాజ్ పాల్గొన్నారు.

అమ్మవారికి కరెన్సీ అలంకరణ



కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గామాత మంగళవారం భక్తులకు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. రూ.55,55,555 కరెన్సీ నోట్లతో అమ్మవారి మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు ప్రత్యేక హోమం చేశారు. కాపువాడలోని సాయి దుర్గామండలి, శ్రీభజరంగ్‌దళ్ దుర్గా మండలి వద్ద కుంకుమ పూజలు కొనసాగాయి. మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

వైభవంగా నవరాత్రోత్సవాలు



ఆసిఫాబాద్: మహాలక్ష్మి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



రెబ్బెన: మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గామాత



కౌటాల: లక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, యువతులు, భక్తులు పూజలు చేస్తున్నారు. అమ్మవారి వద్ద మహిళలు కోలాటం, దాండియాతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కేశవనాథ ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక వాహనాల్లో స్వామివారిని ఊరేగిస్తున్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మంగళవారం కుంకుమార్చనతోపాటు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకులు ప్రకాశ్‌రావులు అమ్మవారిని దర్శించుకున్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్ లోని దుర్గామాత ఆలయంలో హోమంతోపాటు అన్నదానం నిర్వహించారు. ఏరియా జీఎం శ్రీనివాస్‌తోపాటు కార్మిక సంఘాల నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరో రోజు దుర్గామాత మహాలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో కనక దుర్గామాత మహాలక్ష్మీదేవీగా దర్శనమివ్వగా భక్తులు పూజలు చేశారు. జిల్లా నుంచే కాక మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించారు.

దహెగాం: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా చిన్న రాస్పెల్లిలో శారద దేవికి భక్తులు పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహాలక్ష్మి దేవిగా ఆలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కౌటాల: మండల కేంద్రంలోని వాసవిమాత ఆలయంలో మంగళవారం ఆరో రోజు దుర్గామాతకు కరెన్సీ నోట్లతో ఆలకంరించారు. లక్ష్మీదేవిలా ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సభ్యులు వెంకన్న, మౌనిశ్, ప్రశాంత్, సాయి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: కసాబ్‌వాడిలో కొలువుదీరిన శారదమాత



ఆసిఫాబాద్: బాపూనగర్ శారదా మండలి వద్ద



దహెగాం: కుంకుమార్చనలో మహిళలు




రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లో..



రెబ్బెన: ఇందిరానగర్‌లో..







కమ్ముకున్న పొగ మంచు

చింతలమానెపల్లి/కౌటాల: మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. మైదానం వెలుపల ఉన్న భవనంపై సూర్య నమస్కారం చేస్తున్న యువకుడు, మంచులో యువకుల పరుగులు, వ్యాయామం చేస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.